వనమహోత్సవానికి సిద్ధం


షెడ్డునెట్‌లో ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కలకు నీళ్లు పడుతున్న సిబ్బంది


కక్కిరాలపల్లి నర్సరీలో మొలకెత్తిన మొక్కలు

- 17 నర్సరీలు.. 95,300 మొక్కల పెంపకం
- పచ్చదనంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు
- పంచాయతీలకే సంరక్షణ, పెంపకం బాధ్యత

ఐనవోలు: మారుతున్న సామాజిక పరిస్థితుల కారణంగా గ్రామాలు కాంక్రీట్ ఎడారిగా మారి వేడి తాపాన్ని భరించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అడవులు నశించి పోవడం, తీవ్ర కాలుష్యంతో ప్రకృతిలో వాతావరణ అసమతుల్యం ఏర్పడి సరైన వర్షాలు కురవక పోవడం తదితర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏడాది వేసవిలో నర్సరీల్లో మొక్కలు పెంచి వర్షాకాలంలో ఇంటింటికి 6 మొక్కలు పంపిణీ చేసే వనమహోత్స కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి గృహస్తుడు మొక్కలు నాటి, సంరక్షించి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని అవగాహన కల్పిస్తుంది. అందులో భాగంగా మండలంలో వన మహోత్సవాన్ని జయప్రదం చేసేందుకు ఇప్పటికే అధికారులు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు.

95,300 మొక్కల పెంపకం..

మండల వ్యాప్తంగా 17 నర్సరీల్లో 95,300 మొక్కల పెంచుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పూలు, పండ్లు, నీడనిచ్చే మూడు రకాల మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. సాధారణంగా నర్సరీల్లో 70 నుంచి 80 రకాల పూల మొక్కలు పెంచే అవకాశం ఉండగా, ఆయా గ్రామాల్లో ప్రజలు ఇష్ట పూర్తిగా పెంచే మందార, గన్నేరు, లిల్లీ, గులాబీ, చామంతి, మల్లె తదితర మొక్కల పెంపకంపై దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా పండ్ల, నీడనిచ్చే మొక్కల్లో కూడా వేటికైతే డిమాండ్ ఉందో ఆ మొక్కలనే నాటేందుకు సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు.

నర్సరీల్లో పెంపకం ఇలా..

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో ఉపాధి హామీ పథకం కింద మొక్కల పెంపకం చేపట్టారు. ఒక్కో గ్రామ పంచాయతీకి ఒక్కటి చొప్పున నర్సరీ ఏర్పాటు చేసి గ్రామ ఆవాసాల లెక్కల ప్రకారం మొక్కలు పెంచే కార్యాచరణ చేపడుతున్నారు. కాగా మండల వ్యాప్తంగా మొక్కల పెంపకానికి సుమారుగా రూ.24.73 లక్షలు ఖర్చు చేస్తున్నారు. నర్సరీల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను ప్రస్తుతం గ్రామ పంచాయతీలకే అప్పగించారు. కాగా కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్, క్షేత్ర స్థాయి సిబ్బంది సహకారంతో మూడు రకాల మొక్కల పెంపకం చేపడుతున్నారు.

సంరక్షణ ఇలా..

వనమహోత్సవంలో భాగంగా ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకుని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండ వేడిమి నుంచి సంరక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సరీలకు గ్రీన్‌కలర్ షేడ్ నెట్లు ఏర్పాటు చేయడంతో పాటు రోజుకు రెండు సార్లు నీరు అందిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులు నర్సరీలను పరిశీలించి కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. విద్యా సంస్థలు, వసతి గృహాలు, రోడ్డు కిరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


జాగ్రత్తలు వివరిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు (ఫైల్)

డిమాండ్ ఉన్న మొక్కలనే పెంచుతున్నాం..



ప్రతి ఇంటికి ఆరు మొక్కల పంపిణీ, అవెన్యూ ప్లాంటేషన్, ఇతర చోట్లలో కూలిన, డ్యామేజ్ అయిన చెట్ల స్థానంలో నూతన మొక్కలు నాటడంలో భాగంగా మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో సుమారు రూ. 24.73 లక్షల వ్యయంతో మొత్తం 95,300 మొక్కలు పెంచుతున్నాం. పంచాయతీ కార్యదర్శుల సహకారంతో లక్ష్య సాధనకు కృషి చేస్తున్నాం

- నక్క కుమారస్వామి, ఏపీఓ, ఐనవోలు

విద్యార్థుల ఆత్మహత్యపై చారణ చేపట్టాలి


మాట్లాడుతున్న రవి

ఆత్మకూరు : ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీ, ఐఐఎంలలో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడడం బాధాకరమని, వాటిపై విచారణ చేపట్టాలని ధర్మసమాజ్‌పార్టీ జిల్లా కన్వీనర్ మైదం రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళిత విద్యార్థుల మరణాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించి చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల బలవన్మరణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. విద్యార్థుల దృష్టి చదువుపై మాత్రమే ఉండేలా మోటివేట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చుక్క రత్నాకర్, యేసెఫ్, బొంకూరి రాజు, ప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం


ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శాయంపేట : వరంగల్ జిల్లాలోని మమునూరు ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తూ నిధులు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని, దానికి నిదర్శణమే ఎయిర్ పోర్టు అభివృద్ధికి అనుమతులు ఇస్తూ రూ.450 కోట్లు మంజూరు చేయడమేనన్నారు. దీంతో ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు, సీనియర్ నాయకులు భూతం తిరుపతి, కోమటి రాజశేఖర్, బూత్ అధ్యక్షుడు కడారి చంద్రమౌళి, కన్నెబోయిన రమేశ్, మునుకుంట్ల చంద్రమౌళి, పున్నం సాంబయ్య, బత్తుల రాజేశ్, పైడిమల్ల సుధాకర్, ఎర్ర తిరుపతిరెడ్డి, కొంగరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై సురేశ్


మాట్లాడుతున్న ఎస్సై సురేశ్

వేలేరు : మండలంలోని ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సురేశ్ అన్నారు. మండలంలోని శాలపల్లిలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోలీస్ కళాజాత నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, చేతబడి, మూఢనమ్మకాలు, ఈవ్‌టీజింగ్, సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు మూఢనమ్మకాలతో మోసపోవద్దని అన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని, అపరిచితుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే స్పందించొద్దని అన్నారు. కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, కానిస్టేబుల్స్ వీరియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

లైబ్రరీ సైన్స్‌తో ఉపాధి అవకాశాలు


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రం

కేయూ క్యాంపస్: లైబ్రరీ సైన్స్ కోర్సులతో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం అన్నారు. కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలోని బీఎల్ఐఎస్సీ కోర్సుల విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీ సైన్స్ పూర్తిచేసిన అనేక మంది వివిధ ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్ మాట్లాడుతూ విద్యార్థులకు త్వరగా పరీక్షలు నిర్వహించి, ఫలితాలను సకాలంలో వెల్లడించేందుకు కృషిచేస్తామన్నారు. సమావేశంలో లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి, అధ్యాపకులు డాక్టర్ అంజయ్య, కృష్ణమాచార్య, డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ నిరంజన్, డాక్టర్ రామచంద్ర మూర్తి, డాక్టర్ జగన్, శ్రీనివాస్, జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో డివిజన్ బీజేపీ మహిళా అధ్యక్షురాలు జారతి దేవక్క ఆధ్వర్యంలో గామ ఫౌండేషన్ సహకారంతో వంద మంది పేదలకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హాజరై ఎంపిక చేసిన నిరుపేదలకు సరుకులను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొడకుంట్ల శివశంకర్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విదేశాల్లో ఉన్నత విద్యకు సదావకాశం

ఖిలా వరంగల్: ఈనెల 4న వరంగల్ ఉర్సుగుట్ట వద్దగల తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో జెన్, గ్లోబల్ స్టడీ అడ్వైజర్ (యూఎస్ఏ - ఆధారిత) సహకారంతో నిర్వహించనున్న అబ్‌రాడ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ -2025కు 11 దేశాల విదేశీ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరు కానున్నారని కళాశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో చదువుకోవడానికి ఆసక్తి చూపే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, టర్కీ, మలేషియా, ఐర్లాండ్, ఫ్రాన్స్, కెనడా, ఇటలీ, స్కాట్లాండ్, జర్మనీ వంటి ప్రతిష్టాత్మక దేశాలతోపాటు 30పైగా విదేశీ వర్సిటీల ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

విశాలకు గౌరవ డాక్టరేట్

కేయూ క్యాంపస్: వరంగల్ నగరానికి చెందిన బాటనీ అధ్యాపకురాలు లక్కాకుల విశాలకు కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈనెల 1న న్యూఢిల్లీలోని మయూర్ విహార్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో విశాలకు యూనివర్సిటీ ప్రతినిధులు గౌరవ డాక్టరేట్ అందజేశారు. విశాల.. 12 ఏళ్లుగా పలు గురుకుల కళాశాలల్లో బాటనీ సబ్జెక్టును అతిథి అధ్యాపకురాలుగా బోధించారు. విశాల వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు ఆమె సేవలను గుర్తించిన కేంబ్రిడ్జి యూనివర్సిటీ.. డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విశాలను సంస్థ చైర్మన్ డాక్టర్ రామానుజస్వామి, అధ్యాపకులు, ప్రతినిధులు అభినందించారు.

కవయిత్రి అరుణ కీర్తికి సన్మానం



హన్మకొండ అర్బన్: నగరానికి చెందిన కవయిత్రి, గజల్ గాయని అరుణకీర్తి పతాక గజల్ గానం ప్రదర్శనకు ఆమెకు ప్రశంసపత్రం అందజేసి సన్మానించారు. జాతీయ సాహిత్య సదస్సులో భాగంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అక్షర యాన్, సీతాస్ చారిటబుల్ ట్రస్ట్, అభిజ్ఞ భారత్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో అరుణకీర్తి గజల్ గానం చేస్తూ ప్రదర్శన ఇచ్చారు. ఈమేరకు ఆమెకు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, అక్షర యాన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు అయినంపూడి శ్రీలక్ష్మి, సినీగేయ రచయిత సాధనాల వెంకటస్వామి నాయుడు, విశ్రాంత ఐఏఎస్ పార్థసారథి ప్రశంసపత్రం, మెమొంటో అందించి సన్మానించారు.

స్వల్ప అగ్ని ప్రమాదం

రామన్నపేట: నగరంలోని భద్రకాళి దేవస్థానం పక్క ఇంట్లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న మట్టెవాడ పెట్రోకార్ సిబ్బంది మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి ఆదేశాల మేరకు ఫైర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి విద్యుత్ సరఫరా తీసివేయించి మంటలు ఆర్పివేశారు. పెను ప్రమాదం జరగకుండా నివారణ చర్యలు చేపట్టిన పోలీస్, ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో మట్టెవాడ ఎస్సై నవీన్, హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, వాసుదేవ్, కానిస్టేబుల్ కల్యాణ్‌కుమార్, వేణుగోపాల్, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంటలార్పిన ఫైర్ సిబ్బంది



వరంగల్: నగరంలోని 13 డివిజన్ దేశాయిపేట రోడ్డు సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం వేయడంతో ఆదివారం మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి మాట్లాడుతూ ఖాళీ స్థలాలను సదరు యజమానులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు.

ఉడుముల బాలకు సన్మానం



కాజీపేట: విశాఖపట్నం ఆర్చి బిషప్‌గా నియమితులైన డాక్టర్ ఉడుముల బాలను క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కాజీపేట సెయింట్ జోసఫ్ చర్చి ఆవరణలో ఆదివారం ఘనంగా సన్మానించారు. గురువు బాల పెంటారెడ్డి ఆధ్వర్యంలో ఆర్చి బిషప్‌కు శాలువాలు కప్పి అభినందించారు. మడికొండ సంఘం పెద్దలు అరూరి ఈశ్వరయ్య, సుగుణాకర్, అనిల్, వస్కుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పెళ్లి ఖర్చులకు ఆర్థికసాయం అందజేత



కమలాపూర్ : యువతి పెళ్లి ఖర్చులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచింది కమలాపూర్ పద్మశాలి సంఘం. మండల కేంద్రానికి చెందిన చందనాల చిరంజీవి–కోమల దంపతుల కూతురు దీక్షిత వివాహం ఆదివారం జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన దీక్షిత పెళ్లి ఖర్చుల నిమిత్తం పద్మశాలి సంఘం ముందుకొచ్చి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామంతుల శ్రీనివాస్ చేతుల మీదుగా దీక్షిత తల్లిదండ్రులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ కార్యదర్శి, మీడియా జిల్లా కో ఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఎస్ఆర్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మ అమరేష్, పద్మశాలి సంఘం నాయకులు వావిలాల మురళి, వెల్ది కుమార్, ఆడెపు శ్రీకాంత్, పులికంటి ప్రభాకర్, కనుకుంట్ల శ్రీనివాస్, ఆడెపు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన నక్క ప్రశాంత్ మూడు నెలల క్రితం ఆత్మకూరు మండలం గుడ్డెప్పాడ్ వద్ద ద్విచక్రవాహనంతో డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ప్రశాంత్ జీవన జ్యోతి సహాయ సహకార సంఘంలో సభ్యత్వం పొంది ఉన్నాడు. కాగా ఆ సంఘం సభ్యులు బాధిత కుటుంబానికి రూ.42వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో జీవనజ్యోతి సహాయ సహకార సంఘం అధ్యక్షుడు బుర్రి మహేందర్, ఉపాధ్యక్షుడు గజ్జి మహేందర్, ప్రధాన కార్యదర్శి గజ్జి సురేందర్, కార్యదర్శి గజ్జి రమేశ్, కోశాధికారి గమ్మడి రమేశ్, సంఘ సభ్యులు సమ్మయ్య, శ్రీను, భాస్కర్, రాజు, కిషన్, రమేశ్, మల్లయ్య, నగేశ్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న సస్పెన్షన్ సరికాదు



ఆత్మకూరు : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్ చేయడం సరికాదని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్ అన్నారు. మండలంలోని నాగయ్యపల్లిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన కోమటిరెడ్డి బ్రదర్స్‌ను ఎందుకు సస్పెండ్ చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ప్రశ్నించినందుకే మల్లన్నను సస్పెండ్ చేశారని ఆరోపించారు. దళిత, బహుజన ఫ్రంట్, ప్రజాసంఘాల నాయకులు గిన్నారపు రాజు, మాదాసి సుధాకర్, గిన్నారపు శ్రీకాంత్, మాదాసి రాజు, గిన్నారపు ప్రసంగి, మోరె ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన బరిగల ఏలియా అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఆదివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల నాయకులు మునిగాల సంపత్‌కుమార్, జన్ను కుమారస్వామి, దేవదాసు, శ్రీనివాస్, బాబు తదితరులు ఉన్నారు.

పగలే వీధి దీపాల వెలుగులు



వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల్లో వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. మరికొన్ని చోట్ల రాత్రివేళ వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం కమ్ముకుంది. గత ప్రభుత్వ హయాంలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ పంచాయతీ సిబ్బందికి అప్పగించడంతో వారు ప్రతీరోజు ఆఫ్ చేయకపోడటంతో పగలు కూడా లైట్లు వెలుగుతున్నాయి. దీంతో బల్బుల సామర్థ్యం తగ్గి త్వరగా పాడవుతున్నాయని స్థాయికులు ఆగ్రహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిరంతరం బల్బులు వెలుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఉపవాసంతో మానసిక ప్రశాంతత

- పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం
- తొలిరోజు ఇంటింటా ఉపవాస దీక్షలు


ఈద్గా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

ఖిలా వరంగల్: ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం షాబాన్ నెల ముగియగానే ప్రారంభమయ్యే పవిత్ర రంజాన్ మాసం ఆదివారం ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రంజాన్ మాసాన్ని ముస్లింలు అత్యంత పవిత్రంగా భావిస్తూ నెల రోజులు కఠిన ఉపవాస దీక్షలు పాటించనున్నారు. అయిదు పూటలా నమాజ్‌తో పాటు ప్రత్యేక ప్రార్థన (తరావీ) చేయటం వల్ల ఆధ్యాత్మికత అలవడటమే కాకుండా ఆరోగ్యం కూడా మెరుగువుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఓర్పు, సహనం అలవడుతుంది

కఠిన ఉపవాస దీక్షలతో ఆకలి, దప్పికల బాధను ఓర్చుకునే అలవాటు వల్ల ఓర్పు, సహనం అనే సద్గుణాలు అలవడుతాయి. ఆకలి అంటే ఏమిటో తెలిసి నిరుపేదలకు దాన, ధర్మాలు చేసి ఆదుకోవాలనే తత్వం అలవడుతుంది. సామూహిక ప్రార్థనలు, సమష్టిగా ధనిక, పేద అనే భేదం లేకుండా ఇఫ్తార్ (రోజా విరమణ) చేయటం వల్ల ఐక్యత వృద్ధి చెంది తారతమ్య బేధాలు, వైషమ్యాలు, విద్వేషాలు, కోప తాపాలు తొలగిపోతాయని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు.

ఉన్నదాంట్లో కొంత దానం..

ముస్లింలంతా తమ ఏడాది సంపాదనలో 2.50 శాతం నిరుపేదలకు, నిరుపేద విద్యార్థులకు, యువతుల వివాహాలకు విధిగా గోప్యతను పాటిస్తూ దానం చేస్తారు. దానాల్లో గోప్యత పాటిస్తేనే దేవుడు సంతుష్టుడు అవుతాడని వారు నమ్ముతారు. వాణిజ్యపరమైన భూములున్నా, నిర్ణీత ప్రమాణం కంటే ఎక్కువ బంగారమున్నా జకాత్ వర్తిస్తుంది. ఈద్ - ఉల్ - ఫితర్ పండుగకు ముందు రోజు నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఫిత్రా రూపంలో ఆర్థిక సాయం, సరుకులు అందజేస్తారు.

విశ్వాసంతో ప్రార్థనలు చేయాలి



నెల రోజులు దేవుడిపై విశ్వాసంతో, భక్తిశ్రద్ధలతో రోజూ అయిదుసార్లు ప్రార్థనలు చేయాలి. దివ్య ఖురాన్ పఠనం, దైవ చింతన చేస్తూ ప్రతీ ముస్లిం విధిగా రోజా నిర్వహించాలని అల్లా నిర్దేశించారు. ఉపవాసంతో ఆకలి బాధలు తెలిసి ఓర్పు, సహనం వస్తాయి. అభాగ్యుల ఆకలిని అర్థం చేసుకుని దాన ధర్మాలు చేసే తత్వం అలవడుతుంది.

- ఎంఏ.జబ్బార్ ముస్లిం ప్రతినిధి వరంగల్

ఉపవాసంతో మానసిక ప్రశాంతత



ఉపవాస దీక్షల వల్ల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. శరీరంలో పేరుకుపోయిన మలినాలు తొలగిపోతాయి. అనేక రోగాల నుంచి ఉపశమనం లభిస్తుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. దురలవాట్లను మానుకునే అవకాశాలున్నాయి. రోజా వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. అయితే, మధుమేహ రోగులు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

- మహ్మద్ అజిత్, వైద్యుడు, వరంగల్

విలువలతో కూడిన విద్యే లక్ష్యం

మామునూరు ఏంజేపీ ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి



వివిధ వేషధారణలో విద్యార్థులు

హన్మకొండ కల్చరల్: క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యం అని మామునూరు ఏంజేపీ ప్రిన్సిపాల్ వై.మనోహర్‌రెడ్డి అన్నారు. గురుకుల పాఠశాలలో చదవడం అంటే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి చెందడమే అని అన్నారు. ఖిలా వరంగల్ మామునూరులోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా సమన్వయ అధికారి ఎం.సరిత, శాయంపేట ఏంజేపీ ప్రిన్సిపాల్ విజయజ్యోతి, ఐనవోలు ఏంజేపీ ప్రిన్సిపాల్ శ్రీలత, ఉర్సుగుట్ట ఎంజేపీ ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, పూర్వ విద్యార్థి డాక్టర్ మాలోత్ సర్దార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల వార్షిక నివేదికను ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి వివరించారు. వార్షికోత్సవంలో భాగంగా పాఠశాల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, పౌరాణిక డ్రామా, సంగీతం, పాటలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఏటీపీ సురేందర్, డిప్యూటీ వార్డెన్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఫోరం బాధ్యులకు సన్మానం

విద్యారణ్యపురి: ఇటీవల నిర్వహించిన పాఠశాల విద్యాశాఖ ఫోరం రాష్ట్రస్థాయి కార్యవర్గ ఎన్నికలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పలువురు ఉద్యోగులకు చోటు దక్కింది. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆరద్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.ఫకృద్దీన్, కోశాధికారిగా పవన్, అసోసియేట్ అధ్యక్షుడిగా దేవేంద్ర కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఆర్.అశోక్, ఉపాధ్యక్షుడిగా దిలీప్, ప్రచార కార్యదర్శిగా ప్రశాంత్ ఎన్నికయ్యారు. కాగా, వారిని హనుమకొండలో మినిస్టీరియల్ ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ సన్మానించారు.

ఆశ్రమాలకు బియ్యం అందజేత



హసన్‌పర్తి: భీమారంలోని అతిథి, లార్డ్స్ ఆశ్రమాలకు సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బియ్యం అందించారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సుమారు ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని సేకరించి ఆశ్రమాలతో పాటు నిరాశ్రయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శశికుమార్, లార్డ్స్ అనాథాశ్రమ నిర్వాహకుడు నరేష్, అతిథి దివ్యాంగుల కేంద్రం నిర్వాహకురాలు సుజాత, విద్యార్థి సమన్వయకర్తలు రష్మిత, సంజన, అక్షిత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చిరంజీవి, రవికిరణ్, కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.